## క్లుప్తంగా

### చేపల చెరువులో విషప్రయోగం

రూ. 2 లక్షలు నష్టం



మెరకనపల్లి(మోపిదేవి): మండలంలోని మెరకనపల్లి పంచాయతీలో చేపల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలిపినట్లు బాధితుడు యడ్లపల్లి శివప్రసాద్ తెలిపారు. చేపలకు మేత వేయడానికి సోమవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లే సమయంలో చేపలు అన్నీ చనిపోయి నీటిపై తేలియాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ. 2 లక్షలు నష్టం వాట్లిందని, పంచాయతీ అధికారులు న్యాయం చేయాలని ఆయన కోరుతున్నారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు



మోపిదేవి: మోపిదేవి కాలనీ వద్ద ఓ అనాథ జాతీయ రహదారి పక్కన మరణించడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు పంచాయతీ సిబ్బందికి సమాచారమిచ్చారు. కొద్ది కాలంగా గ్రామంలో యాచన చేస్తూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు గ్రామ కార్యదర్శి మల్లేశ్వరావు తెలిపారు. ఉప సర్పంచ్ కోనేరు సుందర్‌సింగ్ సహకారంతో అనాథ మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించినట్లు కార్యదర్శి సోమవారం వివరించారు. స్థానికులు ఉప సర్పంచ్‌కు, పంచాయతీ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

### పెనుమల్లి జెడ్పీహెచ్ఎస్‌కు పూర్వ విద్యార్థుల వితరణ



పెడన: మండలంలోని పెనుమల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 1986–87వ సంవత్సరంలో పదో తరగతి చదివిన.. ప్రస్తుత పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాలకు కంప్యూటర్ ప్రింటర్ జిరాక్స్‌ను అందజేశారు. పాఠశాల పేరు మీద రూ.1,01,116 ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన రసీదును హెచ్ఎం వి.విజయకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను హెచ్ఎం ఘనంగా సత్కరించి సన్మానించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వచ్చే వడ్డీని ఏటా జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవంలో టెన్త్ క్లాసులో మొదటి రెండు బహుమతులు, స్టూడెంట్స్‌కు మిఠాయిలు పంపిణీ చేయడానికి నిర్ణయించామన్నారు. పూర్వ విద్యార్థులు మచిలీపట్నం నక్షత్ర డెంటల్ హాస్పిటల్ డాక్టర్ కె.బ్రహ్మారావు, ఎం.కిషోర్, సీహెచ్ శేషు, ఎస్.రమణ, వై.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సబ్‌జైలు సూపరింటెండెంట్‌కు ప్రశంసలు



కోనేరుసెంటర్: మచిలీపట్నం సబ్‌జైలు సూపరింటెండెంట్ పిల్లా రమేష్ గణతంత్ర దినోత్సవం రోజు కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఆయన్ను జైలు సిబ్బంది అభినందించారు.

### వాసవిలో జేఈఈ మెయిన్స్‌కు 281 మంది హాజరు



పెడన: జేఈఈ మెయిన్స్ పరీక్షలకు నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో మంగళవారం 281 మంది పరీక్షకు హాజరయ్యారని కేంద్రం అడ్మిన్ అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 143 మందికి 140 మంది హాజరయ్యారని, ముగ్గురు ఆబ్సెంట్ అయ్యారన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన పరీక్షకు 143 మందికి 141 మంది హాజరవ్వగా ఒకరు హాజరుకాలేదన్నారు. మొత్తం 286 మందికి 281 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని ఆయన తెలిపారు.

# అలంకారప్రాయంగా ప్రభుత్వ భవనాలు

గూడూరు: మండలంలోని కంచాకోడూరు గ్రామంలో రూ.లక్షలాది ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలు అలంకార ప్రాయంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో ఆకుమర్రు, మద్దిపట్ల గ్రామాలతో కలిపి కంచాకోడూరును గ్రామ సచివాలయంగా ఏర్పాటు చేశారు. దీంతో సచివాలయం పరిధిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, బల్క్‌మిల్క్ సెంటర్, వెల్ నెస్ సెంటర్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. వెల్‌నెస్ సెంటర్‌ను ఆకుమర్రులోను, మిగిలిన భవనాలను సచివాలయ కేంద్రంగా ఉన్న కంచాకోడూరులోనే నిర్మాణాలు చేపట్టారు. ఈ విధంగా రూ.22.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.15 లక్షలతో బల్క్‌మిల్క్ సెంటర్, రూ.25 లక్షలతో సచివాలయ భవనం రెండో అంతస్తు నిర్మాణాలు గతేడాది పూర్తి అయ్యాయి. దీంతో పాటుగా రాయవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో రూ.40 లక్షల నాబార్డు, కేడీసీసీ బ్యాంకు నిధులతో బహుళ ప్రయోజన సౌకర్య గోదాము (ఎంపీఎఫ్‌సీ నిర్మించారు. వీటిని అధికారికంగా ప్రారంభించకపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు దాటింది. అయినప్పటికీ భవనాలు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువద్దామన్న ఆలోచన మాత్రం పాలకులు చేయడం లేదు. అరకొర వసతుల మధ్యే ప్రస్తుత పంచాయతీ కార్యాలయంలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. గోదాము ప్రారంభించి వినియోగంలోకి తీసుకువస్తే రైతులు తాము పండించిన పంటలను నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు భవనాలను ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



కంచాకోడూరు పంచాయతీ.. రెండో అంతస్తులో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం



రూ.22.80 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం





రూ.40 లక్షలతో నిర్మించిన గోదాము: రూ.15 లక్షలతో నిర్మించిన బల్క్ మిల్క్ సెంటరు

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

### బందరులో కలెక్టర్ బాలాజీ పర్యటన

మచిలీపట్నంటౌన్: నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ బాలాజీ మంగళవారం నగరంలోని ఒకటి, ఏడు డివిజన్లలో పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితులు పరిశీలించారు. చిలకలపూడి పాండురంగ స్వామి ఆలయ ప్రాంతంలో కలెక్టర్ డోర్ టు డోర్ వెళ్లి ఇళ్ల యజమానులు తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. మహిళలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తడి, పొడి చెత్త అందజేతపై అందరికీ అవగాహన కల్పించాలని మునిసిపల్ సిబ్బందికి సూచించారు. నగరంలో ప్రతి షాపు ముందు తడి, పొడి చెత్త వేయడానికి రెండు డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకోవాలని, వాటిని వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. ప్రతి షాపు నుంచి శానిటేషన్ సిబ్బంది వాహనాల్లో చెత్తను సేకరించి తరలిస్తారని తెలిపారు. నగరంలో నిర్మించిన డ్రైన్లు అక్కడక్కడ కనెక్టివిటీ లేదని, డ్రైన్ల గ్యాప్‌లు అన్ని కనెక్ట్ చేసే పనులు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట బందరు ఆర్డీఓ కె.స్వాతి, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



తడి పొడి చెత్త సేకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ చిత్రంలో కమిషనర్ బాపిరాజు

## ‘మినుము’లో అధికంగా రసాయనాలు వాడొద్దు

కృత్తివెన్ను: మినుము పైరు ఆశాజనకంగా ఉందని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో రైతులు అధిక దిగుబడులు సాధించాలని మండల ఏవో ఎస్.జెన్నీ అన్నారు. మంగళవారం ఆమె చినపాండ్రక గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మినుము తెగుళ్లకు ఎటువంటి మందులు వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు ప్రశాంతి, అకుల్, గంగాజలరావు, మోహనరావు, నాగేశ్వరరావు, నాగబాబు పాల్గొన్నారు.

కె. కొత్తపాలెం(మోపిదేవి): మినుము పంటలో పూత దశలో బూడిద తెగులు వ్యాపిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె. హెప్సిబారాణి తెలిపారు. మండలంలోని కె. కొత్తపాలెంలో మినుము సాగును సోమవారం పరిశీలించారు.

ఘంటసాలపాలెం(ఘంటసాల): మినుము సాగులో రైతులు విచ్చల విడిగా రసాయన మందుల వాడకంతో మొక్కలు ఎండిపోయి, మాడిపోతున్నాయని ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం కృష్ణా జిల్లాలోని ఘంటసాల, చల్లపల్లి, మచిలీపట్నం, బంటుమిల్లి, గుడివాడ, గుడ్లవల్లేరు, పమిడిముక్కల మండలాల్లో మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి మినుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ రైతులు అవసరానికి మించి పురుగు మందులను, తెగుళ్ల మందులను పిచికారీ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కె.రేవతి, రైతులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోందిలో ఏవో జెన్నీ, వీఏఏలు, రైతులు

## సైబర్ నేరాలపై అప్రమత్తం

కోనేరుసెంటర్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చిలకలపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే నభీ తెలిపారు. మచిలీపట్నంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై చిలకలపూడి పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. నకిలీ ఇ మెయిల్స్, మెసేజ్‌లు, రకరకాల లింకుల ద్వారా మీ వ్యక్తిగత సమాచారం రాబట్టుకునేందుకు సైబర్ నేరగాళ్లు వ్యూహాలు పన్నుతూ ఉంటారన్నారు. ఫేక్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు ద్వారా బ్యాంకింగ్ సమాచారాన్ని దొంగిలించి సంబంధిత వ్యక్తుల ఖాతాల్లో నుంచి నగదును తస్కరిస్తారన్నారు. మీ ఫోన్‌లను హ్యాకింగ్ చేసి అందులోని డేటా మొత్తాన్ని అపహరించి బ్లాక్‌మెయిలింగ్ చేయడం సైబర్ నేరగాళ్ల వృత్తిగా చెప్పారు. ఫేక్ లింకులు ఏవి వచ్చినా క్లిక్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసిపోతే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సీఐ ఎస్ కే నభీ

### పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

బొబ్బర్లంక(మోపిదేవి): పశువుల ఆరోగ్యం కాపాడేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరం వినియోగించుకోవాలని సర్పంచ్ దొప్పలపూడి గంగాభవానీ జగదీష్ అన్నారు. బొబ్బర్లంకలో పశువైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ 53 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. సుమారు 70 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసినట్లు వివరించారు. వీఎల్‌వో ఎస్.శ్యామ్‌సుందర్‌రాజు, పెదప్రోలు జేవీఓ డడ పశువైద్య సిబ్బంది పలువురు రైతులు పాల్గొన్నారు.

### జాబ్‌మేళాకు 28 మంది హాజరు

పెడన: పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 28 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. జిల్లా ఉపాధి కల్పన, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు మచిలీపట్నం, హనుమాన్ జంక్షన్, విజయవాడ ప్రాంతాలకు చెందిన మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 13 మందిని ఎంపిక చేసుకున్నారు. తొలుత నిరుద్యోగులు స్కిల్ హబ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా రావడంతో వచ్చిన వారి వివరాలను రిజిస్ట్రేషన్ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, స్కిల్ హబ్ ఫ్యాకల్టీ వంగ బాబు, అధ్యాపకులు గిరి తదితరులు పర్యవేక్షించారు.

### పింఛన్‌దారులకు కంటి పరీక్షలు

గుడివాడ టౌన్: కంటిచూపు కరువై ఏ పని చేయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పింఛన్ కత్తిరించే పనిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన వడపోత కార్యక్రమం గుడివాడలో మంగళవారం జరిగింది. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కంటి వైద్య నిపుణులు బృందం ప్రత్యేక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ఇందిరాదేవి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ బి. నాగజ్యోతి, వి. స్వప్నలత పాల్గొన్నారు.

### మహిళలు చట్టాలను తెలుసుకోవాలి



పెడన: మహిళలు వారి కోసం చేసిన ప్రత్యేక చట్టాలను తెలుసుకోవాలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు, మెప్మాలోని ఆర్పీలకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుడాలన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుని ఇతరులకు తెలియజేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, మున్సిపల్ ఏఈ సీతారామాంజనేయులు, న్యాయవాదులు ఆజ్మతున్నీసా, షంషద్‌బేగం, ఆర్పీలు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

మచిలీపట్నంటౌన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఈనెల 29వ తేదీ బుధవారం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గంట పాటు ప్రయాణికులు వారి సమస్యలను తెలపడంతో పాటు సలహాలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ప్రయాణికులు చెప్పే సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. 99592 25462 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలిపి సలహాలు ఇవ్వాలని ఆయన సూచించారు.

### 31 నుంచి సబ్‌జోన్ బాలికల ఆటల పోటీలు

కోడూరు: కృష్ణా జిల్లా సెకండరీ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అవనిగడ్డ సబ్‌జోన్ బాలికల ఆటల పోటీలను ఈ నెల 31, ఫిబ్రవరి 1 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు మంగళవారం తెలిపారు. లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల క్రీడాప్రాంగణంలో సబ్‌జోన్ పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. ప్రధానోపాధ్యాయులు పోటీలకు విద్యార్థులను తర్ఫీదు చేయాలని ఎంఈఓ సూచించారు. 1న విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం కూడా ఉంటుందని చెప్పారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అశ్వరావుపాలెం(అవనిగడ్డ): అశ్వరావుపాలెం నాలుగో వార్డులో జెడ్పీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను జెడ్పీటీసీ చింతలపూటి లక్ష్మీనారాయణ మంగళవారం ప్రారంభించారు. రూ.5 లక్షల వ్యయంతో 80 మీటర్ల మేర రహదారిని నిర్మిస్తున్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్‌నజీర్‌బాషా, వార్డు సభ్యురాలు కొండవీటి నాగలక్ష్మితోపాటు ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

### రెండో రోజూ.. పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ



ఘంటసాల: పెరటి కోళ్ల పెంపకంపై మహిళా రైతుల శిక్షణ రెండో రోజు మంగళవారం కొనసాగింది. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళా రైతులకు జరుగుతున్న పెరటి కోళ్ల శిక్షణలో భాగంగా వివిధ నాటు కోళ్ల రకాలు, అధిక గుడ్లు, మాంసం కోసం అభివృద్ధి చేసిన కోళ్ల జాతుల రకాలను, వాటి లక్షణాలను మత్స్యకార శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ తెలియజేశారు. అజోల్లా పెంపకం ఎలా చేయాలి, వాటితో కోళ్లకు కలిగే ఉపయోగాలను కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి వివరించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, మహిళా రైతులు పాల్గొన్నారు.

## ఆ నాలుగు రోజులు ఆమె జీవితాన్ని మార్చేశాయి

- ఇంటి వద్దే చదువుకుని గ్రూప్–1లో డీఎస్పీగా ఎంపిక
- బాధ్యతలు స్వీకరణ వెంటనే మూడు ప్రత్యేక కేసుల ఛేదన
- ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నూతన డీఎస్పీ టి.విద్యశ్రీ



అవనిగడ్డ: వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటేనే విజయం దరి చేరుతుంది. ఆమె జీవితంలో ఇదే జరిగింది. గ్రూప్ 1 నోటిఫికేషన్ వేసే నాటికి అర్హత వయస్సు 21 ఏళకు కేవలం నాలుగు రోజులు మాత్రమే వయసు ఎక్కువ. ఆ నాలుగు రోజులు తక్కువైతే ఈ అవకాశం వచ్చేదేకాదు. అవకాశాన్ని వినియోగించుకుని గ్రూప్ 1లో ర్యాంక్ సాధించి డీఎస్పీగా ఎంపికై లక్ష్యాన్ని సాధించిన టి.విద్యశ్రీ జీవితం ప్రతిఒక్క నిరుద్యోగికి ఆదర్శనీయం. పలు ప్రాంతాల్లో శిక్షణ పూర్తిచేసుకుని ప్రొబెషనరీ డీఎస్పీగా అవనిగడ్డకు వచ్చిన విద్యశ్రీ వారం క్రితం విధుల్లో చేరారు. ఈ కొద్ది రోజుల్లోనే మూడు కీలక కేసులను ఛేదించి విధుల్లోనూ విద్యశ్రీ శభాష్ అనిపించుకున్నారు.

### ప్రభుత్వ ఉద్యోగమే తన జీవితాశయం

తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి ఉండ్రాజవరానికి చెందిన.. ఆర్అండ్‌బీశాఖలో ఇంజినీర్ టి.శ్రీనివాసరావు, హైస్కూల్ టీచర్ ఝాన్సీలక్ష్మి ఏకైక సంతానమే విద్యశ్రీ. హైస్కూల్, ఇంటర్ విద్యాభ్యాసమంతా ఆ ప్రాంతంలోనే జరగ్గా, చెన్నైలో బీటెక్ కంప్యూటర్స్ చేశారు. తల్లిదండ్రుల మాదిరి తాను ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని విద్యశ్రీ మనసులో చిన్ననాటి నుంచే బలంగా నాటుకుంది.

### ఇంటి వద్దే ప్రిపరేషన్

2018లో గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇచ్చేనాటికి విద్యశ్రీకి అర్హత వయస్సు 21 సంవత్సరాలు నిండి కేవలం నాలుగు రోజులే ఎక్కువ. ఆ నాలుగు రోజులు లేకపోతే ఆమెకు ఈ అవకాశం వచ్చేదే కాదు. దరఖాస్తు చేసినప్పటి నుంచి గ్రూప్స్‌లో విజయం సాధించిన వారి సక్సెస్ స్టోరీలు యూట్యూబ్‌లో చూసి ఎలాంటి కోచింగ్ లేకుండా ఇంటి వద్దే ప్రిపేర్ అయింది. వారు ఇచ్చిన సూచనలు పాటిస్తూ వారు చెప్పిన బుక్స్‌ని ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా ప్రిపేరై మొదటి ప్రయత్నంలోనే గ్రూప్స్‌కు ఎంపికయ్యారు.

### అంకిత భావంతో శిక్షణ

2022లో డీఎస్పీగా ఎంపికైన విద్యశ్రీ అనంతపురంలో ఒక ఏడాది పనిచేశారు. అనంతరం బాపట్లలో ఆరు నెలలు, విశాఖలో గ్రేహౌండ్స్ విభాగంలో ఆరునెలలు చేసిన ఆమె ఈ శిక్షణలో ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు చెప్పారు. శిక్షణతో ఎలాంటి క్లిష్ట పరిస్థితులైనా ఎదుర్కొనే మనోధైర్యం వచ్చిందన్నారు.

### చదువే కాదు.. ఆసక్తి కూడా ఉండాలి

చదవడమే కాకుండా పలు అంశాల్లో ఆసక్తి పెంచుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకెళ్లాలన్నారు. విద్యార్థులు చట్ట వ్యతిరేక పనులు చేయొద్దని సూచించారు.

### పగ్గాలు చేపట్టిన వెంటనే

ఈ నెల 20న విద్యశ్రీ అవనిగడ్డ డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుని కోడూరు అయ్యప్పస్వామి ఆలయంలో జరిగిన చోరీ కేసును అదేరోజు ఛేదించారు. ఆ మరుసటి రోజు ఘంటసాల మండలం యండకుదురు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మంగళాపురానికి చెందిన హోం గార్డు గొరిపర్తి యశ్వంత్(20) మరణించగా కర్నూలు వద్ద వాహనాన్ని గుర్తించి తీసుకొచ్చారు. కోడూరు మండలానికి చెందిన ఓ యువతి, విజయవాడ పాత ప్రభుత్వ వైద్యశాల నుంచి రెండేళ్ళ బాలుడిని అపహరించిన ఘటనలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించి సీఐ, ఎస్ఐ, సిబ్బంది సహాయంతో ఆ పిల్లాడిని కాపాడి తల్లిదండ్రులకు అప్పగించేలా చేశారు.

### పెండింగ్ కేసులు లేకుండా..

పెండింగ్ కేసులు లేకుండా చూడటమే లక్ష్యమని డీఎస్పీ విద్యశ్రీ చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఏ ఘటన జరిగినా ఎస్పీకి తెలియజేసి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తానని చెప్పారు. సివిల్స్‌కు ప్రిపేర్ అయి ఐఏఎస్ సాధించాలన్నదే తన లక్ష్యమని డీఎస్పీ టి.విద్యశ్రీ ఆత్మస్థైర్యంతో చెప్పారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

కోనేరుసెంటర్: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని బందరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని బందరు బందరు సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యాన రోడ్డు భద్రతపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తూ కొనసాగిన ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా కొనసాగింది. శివకుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక మంది వాహనచోదకులు మృత్యువాత పడుతున్నారన్నారు. ఇలాంటి మరణాల ఘటనలకు ప్రధానమైన కారణం వాహనచోదకులు హెల్మెట్ ధరించకపోవడమేనన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. చిలకలపూడి సీఐ ఎస్‌కే నభీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించి రక్షణ పొందడమే కాకుండా నూతన తరాలకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



మచిలీపట్నంలో బైక్ ర్యాలీ చేస్తున్న సబ్ డివిజన్ పోలీసులు

## ముగిసిన షటిల్ టోర్నమెంట్

కోడూరు: స్థానిక కోట రాఘవయ్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ పోటీలు రసవత్తరంగా సాగాయి. విద్యాసంస్థల ఆధ్వర్యంలోని రవితేజ పబ్లిక్ స్కూల్ క్రీడాప్రాంగణంలో ఈ పోటీలను రెండు రోజుల పాటు నిర్వహించారు. టోర్నమెంట్‌లో ఓపెన్ లెవన్ నుంచి 16 జట్టులు, స్కూల్ లెవల్ నుంచి 18 జట్టులు పాల్గొన్నాయి. పోటీల్లో ఓపెల్ లెవల్‌లో అవనిగడ్డకు చెందిన రవి, ఫణి జట్టు మొదటి స్థానం, కోడూరుకు చెందిన కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం జట్టు రెండో స్థానం, గుల్లలమోదకు చెందిన ఏసుబాబు, వర్మ జట్టు మూడో స్థానంలో నిలిచాయి. స్కూల్ లెవల్‌లో కోడూరు లక్ష్య పాఠశాలకు చెందిన సందీప్, లోకేష్ జట్టు మొదటిస్థానం, చల్లపల్లికి చెందిన సాత్విక్, కార్తీక్ జట్టు ద్వితీయస్థానం, ఉల్లిపాలెంకు చెందిన అభిరామ్, చింటు జట్టు తృతీయస్థానంలో నిలిచారు. విజేతలకు అవనిగడ్డకు చెందిన పారిశ్రామికవేత్త విక్కర్తి శ్రీనివాసరావు నగదు బహుమతులు అందించారు. విద్యాసంస్థల గౌరవసలహాదారు కోట వెంకటసుబ్బారావు, కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ వల్లభనేని వరప్రసాద్, నిర్వాహకులు కె.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



కోడూరులో విజేతలతో నిర్వాహకులు

### సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి

మొవ్వ: ఆర్థిక చేయూత, పర్యావరణ పరిరక్షణకు మేలుచేసే పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలియోజన పథకంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ జే విమాదేవి అధికారులకు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, వెలుగు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, విద్యుత్ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.